# పెళ్ళంటే?

పోస్టు అన్న కేక వినిపించేసరికి పరుగులాంటి నడకతో వీధిలోకి వెళ్ళింది సుచరిత. పోస్టుమేన్ అందించే అరడజను కవర్లు చూస్తుంటే సుచరితలోని ఉత్సాహమంతా చప్పున చల్లారిపోయింది. ఉసూరుమని నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ లోపలకు

వచ్చేసింది. ఎక్కడనుంచే ఉత్తరాలు" ఉత్తరాలేమున్నాయ్! అన్నీ శుభలేఖలే!" తల్లిమాటకు జవాబుగా అనేసి చేతిలో కవర్లు విసురుగా టేబిల్ పైన పడేసింది.

"అన్నీ శుభలేఖలా! ఎక్కడి నుంచే!" అడిగింది సుభద్రమ్మ. అమ్మ కెందుకీ ఇంత ఆత్రుత బంధుమిత్రుల ఇళ్లలో పెళ్ళిళ్ళు జరగబోతున్నాయంటేనే ఎందుకింత సంబరం.

"అలా నిలుచుండి పోయావేమిటే శుభలేఖలు ఎవరి దగ్గరి నుండి వచ్చాయో చూడు" తల్లి మాటకు ఉలిక్కిపడి ఒక్కొక్కటే చేతుల్లోకి తీసుకొని చూడసాగింది. నాన్నగారి పేర నాలుగు, అమ్మ పేర ఒకటి తన పేర ఒకటి ఉన్నాయి అన్ని వివరాలు తల్లికి చెప్పింది. అంతేనా! ఇన్ని శుభలేఖలు ఒక్కసారి వస్తే ఆ నీలకంఠమే ఇప్పటికైనా కూతురికి పెళ్ళి చెయ్యగలుగుతున్నాడేమో! ఆ శుభవార్త ఏమైనా చెవినవేస్తావేమో అనుకున్నా రావటమైతే ఇన్ని శుభలేఖలు వచ్చాయికానీ మనవాళ్ల దగ్గర నుంచీ ఒక్క సువార్తా లేదు.

సుచరిత నవ్వి అంది "మనవాళ్లంటే ఎవరమ్మా! ఎవరు మనకు శుభలేఖలు పంపితే వాళ్లంతా మనవాళ్ళుకాదూ!"

నువ్వలాగే చెబుతావ్: ముఖపరిచయం ఉన్నవాళ్లంతా మనవాళ్ళు ఎలా అవుతారే? మన బంధువుల ఇళ్లలో ఉన్నారు ఈడొచ్చిన ఆడపిల్లలు సుమారు ఓ పాతికమంది- ఇన్ని శుభలేఖలు వచ్చినా వాళ్ళెవరి దగ్గర్నుంచి కాదు. అదీ నేననేమాట: అయినా మన కులం మతం కాని వాళ్ళెవరో పంపిన శుభలేఖలు ఇవన్నీ! మనవాళ్లని ఎందుకన్నానో ఇప్పటికైనా బోధపడిందా? అమ్మ తన చిన్న సైజు

ఉపన్యాసాన్ని ముగించింది.

సుచరిత తన పేరవచ్చిన శుభలేఖని తీసుకొని అక్కడినుంచి వెళ్ళిపోయింది తన టేబిల్ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చొని స్నేహితురాలి పెళ్ళి ఆహ్వాన పత్రిక చదువుతుంది వచ్చే ఆదివారం సువర్చల పెళ్ళి. సువర్చల పెళ్ళికూతురు కాబోతుందన్న మాట! ఇప్పటికి రామయ్యగారు తన నాల్గో కూతురు సువర్చలను ఒక అయ్య చేతుల్లో పెట్టబోతున్నాడు. ఇంతకీ సువర్చలకు కాబోయే భర్త ఏం చేస్తున్నాడో! నాజూకుగా, మెరుపు తీగలా అందంగా ఉండే సువర్చలను చేపట్టబోయే అతనెలా ఉంటాడో!

ఆర్థిక స్తోమత అంతగాలేని రామయ్యగారు ఎంతో కాలంగా సువర్చలకు పెళ్ళి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పటికి ఏదో సంబంధం కలిసి వచ్చిందన్నమాట. సువర్చల పెళ్ళికూడా అయిపోతే ఇక రామయ్య రమణమ్మగార్ల బాధ్యత తీరిపోయినట్లే! దాని పెళ్ళికోసం ఆ దంపతులు ఎంత ఆరాటపడే వాళ్ళో, ఇక దాని పెళ్ళి చేయలేనేమో నని ఒకటే దిగులుపడేవారు. సుచరిత మనసులో గతం కదలాడింది.

సుచరిత వాళ్ళు రామయ్య గారింట్లోని ఓ వాటాలో అద్దెకుండే వారు. నిజానికి రామయ్యగారిల్లు ఏమంత పెద్దది కాకపోయినా ఉన్న నాలుగుగదుల్లోనే రెండు గదుల్లో వాళ్ళంతా సర్దుకొని మరో రెండు గదులు సుచరిత వాళ్లకు అద్దెకిచ్చేశారు కాస్త డబ్బు కలిసొస్తుందని. కొద్ది రోజులకి తనకు సువర్చలకు పరిచయం ఏర్పడడం, అది బలమైన స్నేహంగా మారటం జరిగిపోయింది. తన ముగ్గురి అక్కయ్యల పెళ్ళిళ్ళు ఎలా జరిగాయి. ఆ పెళ్ళిళ్ల

అర్భాటాలతో, కట్న కానుకలతో తమ కుటుంబం ఎంతగా చితికిపోయింది. చెప్పుకొచ్చేది సువర్చల. వింటుంటూనే తన హృదయం ద్రవించిపోయేది. ఆడపిల్లల్ని కన్నందుకు ఫలితం ఇదేనా! ఆడపిల్లల తల్లిదండ్రులు ఇన్ని సమస్యలు ఎదుర్కోవటమా? ఈ రకమైన ఆలోచనలతో సతమతమయ్యేది తను. రమణమ్మగారు కూడా తన నెంతో ప్రేమగా చూసేవారు. తీరిక ఉంటే తను వాళ్ళింట్లోనే ఉండేది. ఆవిడ కూడ ఎప్పుడు సువర్చల పెళ్ళి ఎలా చేయగల్గుతామా! అని వాపోయేది. ఇప్పటికీ ఆడపిల్ల పెళ్ళి ఇంత గడ్డు సమస్యా అనిపించేది తనకు. ఆ మాటే రమణమ్మగారితో అంటే ఆవిడ పేలవంగా నవ్వి.

“అంతే కాదమ్మా! ఎలాగో అష్టకష్టాలుపడి ఆ మూడుముళ్ళు వేయించినా అక్కడితో ఈ సమస్య అంతమైతే బాగానే ఉణ్ణు. ఆ తర్వాత మాత్రం ఖరీదైనా బట్టలు పెట్టలేదని, పండుగలకు వచ్చినప్పుడు మర్యాదలు చాలలేదని, అల్లుళ్ళ అలకలు, వియ్యపురాళ్ల ఎత్తిపొడుపులు తప్పవు. స్కూటరుదగ్గర నుంచి రేడియో టేప్ రికార్డర్, సైకిలు, రిస్టువాచి ఇలా కానుకల రూపంలో వాళ్లు కోరే గొంతెమ్మ కోర్కెలు తీర్చటం తప్పవు. ఇక అమ్మాయి పెళ్ళిళ్ల కోసం చేసిన అప్పులకు వడ్డీకూడ చెల్లించే అవకాశం ఇవ్వరు. “అల్లుళ్ళు అనే ఆ “పురుషపుంగవులు” అన్నారు. ఆ మాటలు ఆమె నోట వినటమేకాదు. ప్రత్యక్షంగా ఆ సంఘటనలన్నీ కళ్ళార చూచింది తను. సువర్చల పెళ్ళి కోసం అవి రామయ్యగారు కష్టపడి వెనకేసిన నాలుగువేలు, ఓ సంవత్సరం పెద్ద పండుగకు వచ్చిన అల్లుళ్ళ కోర్కెలకు హారతికర్పూరంలా హరించిపోయాయి.

అప్పుడు రామయ్య రమణమ్మగార్లు ఎంత బాధపడ్డారని!



కథా నిలయం
3819

సువర్చల తల్లిదండ్రుల బాధ చూడలేకపోయింది. అంత తన మూలానే అని తన పెళ్ళికోసమే అమ్మనాన్నలు ఇంత ఆవేదనకు గురికావాల్సి వస్తోందని నాతో చెప్పుకుని ఎంత వాపోయింది. పోనీలే! ఇన్నాళ్ళకు సువర్చల పెళ్ళి కూతురు అవుతోంది. ఎలాయైనా తను సువర్చల పెళ్ళికి వెళ్ళి తీరాలి అనుకుంది సుచరిత.

ఆ మరునాడు అమ్మ నడిగింది. సువర్చల పెళ్ళికి వెడతానని "ఏవిటే! రమణమ్మ కూతురి పెళ్ళా" సంతోషంతో వెలిగిపోయింది అమ్మ ముఖం.

"అవునమ్మా! నిన్న నా పేర వచ్చిన శుభలేఖ అదే!"

పోనీ తల్లీ! ఇన్నాళ్ళకు ఆ అమ్మాయి అత్తింటికి వెళ్లబోతోం దన్నమాట! నువ్వు తప్పకుండా వెళుదువుగానిలే!"

అమ్మ అంగీకారం ఆనందం కలిగించింది.

ముహూర్తానికి ఓ రోజు ముందుగానే గుంటూరు బయల్దేరింది విజయవాడ, గుంటూరుల మధ్య అట్టే దూరం లేకపోవడం తన అదృష్టం. లేకపోతే బోలెడు డబ్బు ఖర్చుపెట్టి వెళ్లగలిగేదా తను! ఇంకో అరగంటలో సువర్చలను చూడబోతోంది తను. పెళ్ళి కూతురిగా ఇప్పుడే తన కళ్లలో మెదులుతోంది. తన ఊహలతో ఉయ్యాల కట్టేసి దానిలో ఊగేస్తుంది సువర్చల. అందమైన పట్టు చీరలో నుదుట కల్యాణ తిలకముతో, పూలజడతో తన ప్రియ నెచ్చలి నూతన వధువై తలవొంచుకొని వరునిప్రక్కన కూర్చునే ఆ శుభ ఘడియలో తనకంతటి ఆనందం.

అసలు సువర్చలను చేపట్టబోయేవాడు ఎంతో అదృష్టవంతుడు ఎంతటి సౌందర్యరాశి అంతటి సుగుణాల రాశి కూడా సువర్చల.

అలాంటి కన్యను తనదాన్ని చేసుకోబోతున్న ఆ యువకుడు అదృష్ట వంతుడు కాక మరేమిటి?

గుంటూరు చేరుకొని రామయ్యగారింటికి వెళ్ళేదాక సుచరిత ఇలాటి ఆలోచనా లోకాలలోనే తేలిపోయింది. పెళ్ళివారిల్లైతే పెళ్ళి సందడితో కళకళలాడుతోంది కానీ, పెళ్ళికూతురు సువర్చల ముఖంలో మాత్రం ప్రత్యేకమైన కళ ఏమీ కన్పించలేదు. తనను చూడగానే మాత్రం అప్యాయంగా కౌగలించుకొని "ఎన్నాళ్లకు కలిసేమే సుచరితా"! అంది. "పెళ్ళి కూతురివై నన్ను నీదగ్గరికి రప్పించుకున్నావేగా?" అని తనంటే పేలవంగా నవ్వింది.

పెళ్ళి కూతురు నెమ్మదిగా తనలో అనుకుంది. సువర్చల అనుకోవటంలో అర్థమేమిటో? తెలియలేదు సుచరితకు.

సువర్చల ఎందుకలా అనుకుందో? ఎందుకలా పేలవంగా నవ్విందో ఆమెలో పెళ్ళి కళ సంతోషము ఎందుకని లేవో తెలుసు కున్న మరుక్షణం సుచరిత నీరు కారిపోయింది.

ఆ వెంటనే ఆమె మనస్సు కోపంతో బుసలు కొట్టింది. ఆ కోపం రామయ్య రమణమ్మ గార్లపైన. ఆవేశంతో వాళ్ళ దగ్గరకి పరిగెత్తింది. రమణమ్మగారు కాబోయే అల్లుడికివ్వవలసిన కట్నం కాబోలు వంద రూపాయల కాగితాలు ముందుంచుకొని లెఖ్ఖపెడుతు న్నారు. "తొందరగాకానీ! అవతల ముహూర్తం వేళ అయిపోతోంది. ముందు ఈ అయిదు వేలు అందుకోందే పందిట్లోకి రారు ఆ మగ పెళ్ళివారు" రామయ్యగారు అంటున్నారు.

"అసలు సువర్చల కింత అన్యాయం చెయ్యటానికి మీకు మనస్సెలా ఒప్పింది!" సుచరిత మాటకు ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

"దానికిలా వ్రాసిపెట్టిఉంటే ఎవరేం చెయ్యగలం అమ్మాయ్"? రమణమ్మగారు కాస్త సర్దుకొని అన్నారు.

రాతలూ, గీతలూ, అంటూ కబుర్లు చెప్పకండి, చేతులారా మీరు చేస్తున్నదే ఇదంతా! మీ అమ్మాయికి మీరే తీరని ద్రోహం చేస్తున్నారు.

సుచరిత ధోరణికి విస్తుపోయారు ఆ దంపతులు. ''ఏ తల్లి దండ్రులు కన్నబిడ్డల భవిష్యత్తు కావాలని నాశనం చెయ్యరు. అన్నిటికి తగిన కారణాలుంటాయి'' అనేసి రామయ్యగారు భార్య లెఖ్ఖపెట్టి ఇచ్చిన కట్నం డబ్బు తీసుకొని మగపెళ్ళివారికోసం ఏర్పాటు చేసిన విడిదికి వెళ్ళిపోయారు. రమణమ్మగారు హడావిడిగా పందిట్లోకి పరుగెత్తారు.

చేసేదిలేక తనూ పందిట్లోకి నడిచింది సుచరిత.

సువర్చల పెళ్ళికూతురై పెళ్ళి పీటలపై కూర్చుంది. యధా విధిగా జరిగిపోతోంది. పెళ్ళి తంతు, బిగ్గరగా సన్నాయిమేళం "సీతమ్మ పెళ్ళి కూతురాయెనే.... మా రామయ్య పెళ్ళి కొడుకు కాయెనె...అంటూ మ్రోగుతోంది.

సుచరిత మనస్సు భగ్గున మండింది. ఒక్క ఉరకలో మేళం వాళ్ళ దగ్గరకు వెళ్ళింది. "ఆపండి" సుచరిత మాటలకు ఒక్క క్షణం సన్నాయి మేళం ఆగింది.

సుచరిత వాళ్లందరికి ముఖాల్లోకి చూస్తూ "ఈ పాటకాదు మీరు వాయించవల్సింది. పుత్తడి బొమ్మ పూర్ణమ్మ" వాయించండి.

"అదేమిటీ తల్లీ!" అంతా ఒక్కసారి అడిగేరు.

"అదంతే! ముందు వాయించండి!" మేళం వాయించే వాళ్లంతా ముఖముఖాలు చూసుకున్నారు. మళ్ళీ సన్నాయి వాయించే ఆయనే అన్నాడు.

"ఆ పాట మాకు తెలియదమ్మా అయినా అన్ని పెళ్ళిళ్ళలోనూ ఇలా వాయించటమే రివాజు" సన్నాయి వాళ్లందరికి సైగచేసి "సీతమ్మ పెళ్ళి కూతురాయెనె" అంటూ మళ్ళీ అందుకున్నాడు.

పందిట్లో వీనుల విందుగా విన్పిస్తోంది ఆ కమ్మని రాగం. సుచరిత పిచ్చెక్కినట్లు పందిట్లో అటూ, ఇటూ తిరుగుతోంది.

"పోనీలే! రామయ్య కష్టాలు గట్టెక్కాయి. ఇన్నాళ్లకి ఆఖరి కూతురు పెళ్ళి చేసేస్తున్నాడు. ఇక రామయ్యకే బాధ్యతల్లేవు" దగ్గర బంధువు ఓ ముసలాయన అంటున్నాడు. తన ప్రక్కనే ఉన్న మరో ఆయనతో నెమ్మదిగా.

"ఏం బాధ్యతలు తీర్చుకోవటం బాబాయ్ గారు! అంత ఈడూ జోడూ లేని పెళ్ళి ఎలా చేస్తున్నారా? అని నాకు బాధగా ఉంది" అంటున్నాడా యువకుడు.

ఆ మాటలు సుచరిత చెవుల్లో పడ్డాయి. "అవ్వ! అవ్వ! ఎంత ఘోరం! ఈ పుత్తడి బొమ్మకునూ, చూస్తూ, చూస్తూ ఆ ముసలి వాడికి ఏలా కట్టబెట్టేస్తున్నారో.... కన్న కూతురన్న మమకారం ఏమైపోయిందో!"

"మరీ అలా అనేయకు వదినా! అతను ఏవంత ముసలాడు! నాలుగు పదులు దాటేయి అంతేగా! అయినా ఏం చేస్తారు? ఎప్పటికి కుదరకపోతే ఏదో సంబంధం తెచ్చారు. పెళ్ళంటూ చేయాలిగా ఆడపిల్ల అన్నాక...."

ఈ మాటలు సుచరిత చెవినపడ్డాయి. ఈ పెళ్ళిని గురించి వ్యాఖ్యలు ఎన్నో రకాలుగా సుచరిత చెవుల్లో పడుతూనే ఉన్నాయి. కొందరి సమర్థింపు. ఇంకొందరి సంతృప్తి. కొందరి ఆవేదన. మరికొందరి మధ్యస్తపు మాటలు సుచరిత తల తిరిగిపోతోంది.

అ పెళ్ళికొడుకు సువర్చలకు మూడు ముళ్ళు వేస్తూనే ముగ్గురు పిల్లలకు తల్లిని చేసేసాడు. ఆ తలపే భరించలేనిదిగా ఉంది. ఇక అక్కడ ఉండలేక తిరుగు ప్రయాణం కట్టింది.

ఏవే అమ్మాయ్ ఎలా జరిగింది పెళ్ళి? ఎలా ఉన్నాడు పెళ్ళి కొడుకు? సువర్చలకు ఈడూ జోడేనా? అతను చేసేది ఉద్యోగమా? వ్యాపారమా? కాస్తంతైనా ఆస్తి పాస్తులున్నాయా? ప్రశ్నల వర్షం కురిపిస్తున్న తల్లి ముఖంలోకి తీక్షణంగా చూసింది సుచరిత.

"నీ ప్రశ్నలకు సమాధానం ఇదే. అన్నట్టు తరువాత తన మనస్సులో రగులుతున్న బాధనంతా తల్లి ముందు వెల్లడించింది.

అమ్మా! రమణమ్మ, రామయ్యగార్లు, సువర్చలకి తీరని అన్యాయం చేసినట్టూ కాదూ! చివరికి తల్లిని ప్రశ్నించింది. మళ్ళీ సూటిగా ఆమె ముఖంలోకి చూసింది.

అమ్మ ముఖంలో రవ్వంత దిగులు చోటు చేసుకున్నా తనలో కలిగినంతటి ఆవేశం కోపం కన్పించలేదు. సుచరిత భావాన్ని చదివేసిందేమో! నిట్టూర్చి.

ఈ విషయంలో వాళ్ళని కోపగించుకోవటానికే ముందమ్మా! అంతకన్నా వాళ్ళు చెయ్యగలిగింది ఏముంది? ఎన్నేళ్ల నుంచో అమ్మాయి పెళ్ళి చేయాలని ఎన్నో సంబంధాలు వెతికేరు. వరకట్న పిశాచం ప్రళయతాండవం చేస్తున్న ఈ కాలంలో అన్ని విధాల,

అనుకూలమైన సంబంధం ఎక్కడ కల్సి వస్తుంది. చివరకు ఏదో ఒకటి చూసిపెట్టేయక తప్పదమ్మా! ఆడపిల్లల తల్లిదండ్రులకు అలా చెయ్యకపోతే ఆ పిల్ల బ్రతుకు ఏమవుతుందా? అన్న మాట అటుంచి, కూతురు పెళ్ళి చేయలేని అసమర్థులుగా వేలెత్తి చూప బడతారు.

ఇక ఆ పిల్ల ఉద్యోగం చేస్తున్నదైతే సంపాదన పైన ఆశతో పెళ్ళి చెయ్యని స్వార్థపరులుగా జమకట్టబడతారు. ఇవమ్మా ఈనాటి తల్లిదండ్రులు పడుతున్న అవస్థలు. మరి అలాంటప్పుడు ఏదో కల్సి వచ్చిన సంబంధం కాదనుకొని రామయ్య రమణమ్మగార్లు చెయ్య గల్గిందేముంది చెప్పు?"

అమ్మ మాటల్లోని యధార్థం సుచరిత గ్రహించింది. రామయ్య రమణమ్మగార్లను నిందించినందుకు పశ్చాత్తప్తురాలయింది.

ప్చ్ పెళ్ళి! హు, పెళ్ళి! 'పెళ్ళి' అనే మాటకు సరియైన నిర్వచనం చెప్పగలిగిన వాళ్లు ఏనాడైనా ఉన్నారా? కాలం మారినా కన్నె కథ మారలేదు. అది ఎప్పుడూ కన్నీటిగాధే! 'కన్యాశుల్కం' పేరుతో ఆనాడు కన్యను అమ్ముకుంటే, కాలంలో వచ్చిన మార్పులు కన్నెపిల్ల మెడకు మరో రకం ఉచ్చులు తగిలించేయి. వరకట్న దురాచారం ప్రబలి, దానికి అమాయకురాళ్ళైన ఆడపిల్లల బ్రతుకులే బలి.

అసలు 'పెళ్ళి' కావల్సింది ఒక్క ఆడపిల్లలకేనా? స్త్రీకి పురుషుని నీడ ఎంత అవసరమో అతనికి ఆమె తోడు అంతే కాదా? పెళ్ళంటే రెండు జీవితాల అల్లికని, రెండు హృదయాల కలయికని ఆనాడు, ఈనాడు, ఏనాడూ ఎవ్వరూ గమనించలేదు. ●